## తోక చుక్కపై
## విశ్వమంతా
## తిరిగే
## ఆ వింత మనుషులు
## ఏ లోకం వారు?

# రాపేటి రామకృష్ణారావు కథ

# తోకచుక్క

స్పేస్ లాబ్ జ్యేష్టని ప్రయోగించి నెల రోజులైంది. అవి సూర్యుని చుట్టూ మెర్క్యురీ గ్రహపు కక్ష్యకి కాస్త బయటగానే పరిభ్రమిస్తూంది. శాస్త్రజ్ఞులు సునిశితమైన పరికరాలతో ఎంతో శక్తివంతమైన టెలీస్కోపుతో హేలీ తోకచుక్కని పరిశీలించడం కోసం జ్యేష్ట ప్రయోగశాలని రూపొందించి రోదసిలోనికి ప్రయోగించారు.

హేలీ సూర్యుని సమీపించి మళ్ళీ అనంతాకాశంలోకి తిరోగమించే దాకా దానిని వెంబడించి సమీపించి దాని కేంద్రకంలోని మంచు ముద్దని శాంపుల్‌గా తీసుకుని భూమికి తేవడంతో జేష్ట కార్యక్రమం పూర్తవుతుంది.

రిఫ్లెక్టర్ టెలిస్కోపులో ఏస్ట్రో ఫిజిసిస్టు శ్యామసుందర్ ఆకాశాన్ని చూసాడు. ఆ నల్లని ఆకాశంలో కోట్లాది నక్షత్రాలు ఎంతో కాంతివంతంగా కనిపిస్తున్నాయి. హేలీ తోకచుక్క దిశగా టెలిస్కోపుని ఎడ్జస్టు చేసాడు. దాని తలకాయ మధ్యభాగం లోనికి ఫోకస్ చేసాడు. తెల్లని న్యూక్లియస్ దానినే ఘనీభవించిన మురికి నీళ్ళ ముద్దగా శాస్త్రజ్ఞులు భావిస్తున్నారు. ఆ న్యూక్లియస్ చుట్టూ నల్లని శూన్యంలాంటి మచ్చ కనిపిస్తుంది. ఐపేస్‌లో కన్నువుంచి ఆ నల్లని ప్రాంతాన్ని బాగా పరిశీలించాడు. కన్ను మంట పుట్టింది. పరిశీలన చాలించి టెలిస్కోపు మౌంట్ మీదినుంచి క్రిందికి దిగాడు.

1986 సంవత్సరంలో హేలీ భూమిని సమీపించినపుడు యూరోపియన్ స్పేస్ ఏజన్సీవాళ్లు సేకరించిన సమాచారంగల



పుస్తకం తెరిచాడు. ప్రక్కనే మరో సీట్ మీద కూర్చుని పేనల్ మీది ఎలక్ట్రానిక్ పరికరాలను గమనిస్తున్న వింగ్ కమాండర్ విశ్వనాథ్ ప్రొఫెసర్ మళ్ళీ పుస్తకం చదవడం చూసాడు.

విశ్వనాథ్ మంచి ఏస్ట్రోనాట్. హెలీ తోకచుక్కని పరిశీలించడానికే ప్రొఫెసర్ శ్యామసుందర్ తోపాటు ఎయిర్ ఫోర్సువాళ్ళ

ప్రభుత్వం ఆదేశంమీద అతనిని నియమించారు.

"ఏం ప్రొఫెసర్ గారూ! మళ్ళీ పుస్తకం తెరిచారు నిజమైన హేలీనచ్చలేదా ఏమిటి?" అన్నాడు నవ్వుతూ ఏదో ఒకలాగ సంభాషణలోకి దించకపోతే ప్రొఫెసర్ తల ఎత్తడు.

సీరియస్‌గా పఠనంలో మునిగిన ప్రొఫెసర్ విశ్వనాథ్ వేపు చూసాడు. ముఖం ప్రసన్నంగా మార్చుకుని "1986 సంవ సంవత్సరంలో గ్రూప్‌కేప్టెన్ గుప్తతో పంపిన రాకెట్ హేలీని గుద్దుకుని నాశనమైన తీరుని పరిశీలిస్తున్నాను. క్షణ క్షణానికీ మారిన దాని వేగం దిశ ఆధారంతో వేసిన ఈ గ్రాఫ్‌ని మీరూ చూడండి" అని పిలిచాడు.

విశ్వనాథ్ ఆ గ్రాఫ్‌ని అర్థం చేసుకున్నాడు. నిజమే ఎంతో పరిమాణంగల భూమి కూడా ఏ వస్తువునీ అంత వేగంగా ఆకర్షించుకోలేదు. "దీనిని బట్టి మీరు ఏమి ఊహిస్తున్నారు ప్రొఫెసర్‌జీ?" అని అడిగాడు. తెలుగువాడైనా చాలా కాలంనుంచి ఎయిర్‌ఫోర్సులో పనిచెయ్యడం చేత 'జీ' అని సంబోధించడం వింగ్ కమాండర్ విశ్వనాథ్‌కి బాగా అలవాటైంది.

"నా అనుమానం ప్రకారం ఏదో బలమైన అయస్కాంతశక్తి ఆ నౌకని ఆకర్షించి వుండాలి. మూడు మైళ్ల వ్యాసంగల ఒక మంచుగడ్డకి అంత శక్తి వుండదు వింకోజీ" అని ప్రొఫెసర్ తన అభిప్రాయం చెప్పాడు. విశ్వనాథ్‌ని అతని సన్నిహితులు అతడు వింగ్ కమాండర్ గనక వింకో అని సంబోధిస్తూ వుంటారు.

"ఇంతకీ మీరనేదేమిటి ప్రొఫెసర్! మన లాబ్‌ని కూడా మళ్లీ హేలీ ఆకర్షిస్తుందంటారా? గ్రూప్ కెప్టెన్ గుప్త గారికి పట్టిన గతే మనకీ పడుతుందంటారా ఏమిటి?" అన్నాడు విశ్వనాథ్ భయాన్ని నటిస్తూ జోక్‌గా.

"ఇది 2062 సంవత్సరం. ఆ దుస్సంఘటన జరిగిన నాటినుంచీ ఈ సంవత్సరం కోసం 76 సంవత్సరాలుగా మన శాస్త్రజ్ఞులు ఎదురు చూస్తున్నారు. ఈ లేబొరేటరీని ఇదే పరిశోధన కోసం కష్టపడి మన ఇంజనీర్లు రూపొందించారు. మనం చావడానికి సిద్ధపడే వచ్చాం. ఇంక ఏ గతి పట్టినా మనకి భయమెందుకు?" అని నవ్వబోయాడు.

ప్రొఫెసర్ నవ్వు పెదవులు దాటనేలేదు. ప్రమాద సంకేతం స్పీకర్‌లోనుంచి చెవులదిరేలాగ వినిపించింది. ఇద్దరూ అదిరిపడ్డారు. కంట్రోల్ పేనల్ వేపు చూసారు. ఎర్రని లైటు వెలుగుతూ ఆరుతూ ఆ భయంకర శబ్దానికి లయలాగా మరింత భీతి కలిగించసాగింది.

ఎక్కుపెట్టబడ్డ బాణంలోనుంచి వెలువడ్డ అమ్ముల్లాగ పేనల్ దగ్గరకి గంతువేసారు. విశ్వనాథ్ కళ్ళు కంపిస్తున్న కంపాస్ ముల్లులను చూసాయి. అప్పటిదాకా హాయిగావున్న వాతావరణం భయంకరంగా మారిపోయింది.

మేగ్నటిక్ కంపాస్ ముల్లు అయస్కాంతమే. భూమి మీదనైతే అది

ఉత్తర దక్షిణాలను చూపుతుంది. శూన్యంలో సౌర సంబంధమైన అయస్కాంత క్షేత్రాల ఉనికిని గుర్తించడం కోసం వాటిని వుంచారు. ఇప్పుడా కంపాస్ ముల్లులు విపరీతంగా కంపిస్తూ హేలీ న్యూక్లియస్ వేపు చూపుతున్నాయి. ఏదో మేగ్నటిక్ బీమ్ జ్యేష్టని ఆకర్షిస్తున్నదని అర్థం చేసుకున్నారు.

ఒకే కొలతగల కాంతి తరంగాలు లేసర్ కిరణంగా మారి లక్షల మైళ్ళ దూరంలోనున్న వస్తువుని భస్మం చెయ్యగలదు. అయస్కాంత శక్తి కూడా బీమ్‌గా ఏర్పడడం అసాధ్యం. వారిజ్యేష్టనౌక హేలీ తోకచుక్కకి దాదాపు 500 మైళ్ల దూరంలో వుంది. అంత దూరంనుంచి ఆకర్షించడం ఆశ్చర్యపోయారిద్దరూ. అప్పటికే జేష్ట తన ట్రాజెక్టరీని మార్చుకుని హేలీ తలకాయలోకి దిగజారడం టి.వి తెరమీద చూసారు. ఇద్దరి ముఖాలమీద శరీరాలకు అనుకూలమైన ఉష్ణోగ్రత గల ఆ నౌకాంతర్భాగంలో కూడా చెమటలు పట్టాయి.

"నో ప్రాబ్లమ్ సర్ ఐ విల్ బ్లాస్ట్ ది రాకెట్స్ మన నౌక భూమి వేపుకి దూసుకపోయేలాగ చేస్తాము. ఈ లోగా మీరు భూమిని కంటాక్ట్ చేసి జరిగింది చెప్పండి" అన్నాడు.

నో ప్రాబ్లమ్ అని అన్నాడే గాని విశ్వనాథ్ ఎంత ఆందోళన చెందుతున్నాడో అతనికళ్లే చెబుతున్నాయి. అతని వణికే గొంతు చెబుతూంది. అది కేవలం తనకి ధైర్యం చెప్పే ప్రయత్నమే అని అర్థం చేసుకున్నాడు ప్రొఫెసర్.

1986లో ఆ ప్రమాదం. ఇప్పుడు 2062లో ఈ ప్రమాదం. అయినా మనిషి తన పరిశోధన ఆపడు. మళ్లీ 2138 సంవత్సరంలో మరికొందరు వ్యోమగాములు హేలీలోని మేటర్ కోసం బయలుదేరి తీరుతారు అనుకున్నాడు.

ట్రాన్స్‌మీటర్ ఆన్ చేసాడు. "హెలో! హెల్లో!! దిస్ ఈజ్ అబ్జర్వేటరీ జేష్ట. శ్యామసుందర్ స్పీకింగ్ ఆర్ యు గెటింగ్ మి అని రెండు మూడుసార్లు భూమికి ప్రసారం చేసాడు. భూమి దాదాపు

## డమ్మీ మాష్టారు



మన రాష్ట్రంలోని 'ఏలూరుపాడు'కు చెందిన రామమూర్తిరాజు అనే 'డమ్మీ మాష్టారు' ఈ మధ్య వెలుగులోకి వచ్చారు. ఆయనగారు 18 సంవత్సరాలనుంచీ ఆ వూరిస్కూల్లో ఉపాధ్యాయునిగా జీతం తీసుకొంటున్నా ఒక్క రోజుకూడా స్కూలుకి వెళ్లి పాఠం చెప్పలేదట! తనకు బదులుగా ఎప్పుడూ ఎవరో ఒక నిరుద్యోగ యువకుణ్ణి అద్దెకు పంపుతూ వస్తున్నాడట. అంటే తన జీతంలో కొంతభాగం "అద్దె మాష్టారికి" ఇస్తూ వుండేవాడన్నమాట! అయితే అతగాడి పాపం పండి ఉన్నతాధికారులకు ఈ విషయం తెలిసి అతణ్ణే సస్పెండ్ చేశారట ఈ మధ్యనే.

—జూపిటర్

ఆరున్నర కోట్ల మైళ్ల దూరంలోవుంది. కాంతి వేగంతో అంటే సెకండుకి 1,86,000 మైళ్ల వేగంలో ప్రయాణించే రేడియో తరంగాలకి కూడా భూమిని చేరడానికి 35 సెకండ్లు పడుతుంది. అందుచేత ఆపరేటర్ సిద్దంగా వుండి వెంటనే సమాధానం ఇచ్చినా ఒక నిమిషంపావు తిరిగి వార్తరావడానికి పడుతుంది. ఆ టైమ్ లేగ్‌ని దృష్టిలో వుంచుకుని క్షణమొక యుగంగా ఎదురు చూసాడు.

అనుకున్న టైమ్‌లోనే సమాధానం వచ్చింది.

"హెలో! దిస్ ఈజ్ యునైటెడ్ సెటిలైట్ కమ్యూనికేషన్స్. హెలీ లింక్ సర్వీస్. గెట్టింగ్ యూ చెప్పండి శ్యామసుందర్ గారూ" అని వినిపించింది.

ప్రొ. శ్యామసుందర్‌కి ప్రాణంలేచి వచ్చింది. ఎన్నిమార్లు అరవాలో అనుకున్నాడు. కాని భూమిమీది అందరూ చాలా ఎలర్ట్‌గా తమని ఫాలో అవుతున్నారని అర్థం చేసుకున్నాడు.

ఒక్క క్షణమైనా ఆలస్యం చేయకుండా "హెలో! హెలో!" అంటున్న ప్రొఫెసర్ గొంతులో కంగారు "మా హేలీ అబ్జర్వేటరీని హెలీ తోకచుక్క ఎంతో వేగంగా ఆకర్షిస్తోంది. ఆనాడు గ్రూప్ కెప్టెన్ గుప్తగారి నౌకకి పట్టిన గతే జ్యేష్టకీ పట్టబోతున్నది" అని ఎవరో వెంట తరుముతున్నట్టు పూర్తి చేసాడు.

భూమికి వర్తమానం అందించగలనో లేనో అని భయపడ్డాడు. ఫరవాలేదు. మరో నిమిషంలో హైదరాబాద్ నుంచి దావానలంలాగ ప్రపంచమంతా వార్త వ్యాపిస్తుంది అనుకుని తృప్తి పడ్డాడు. వార్త వాళ్లకి చేరడం వరకేగాని ఎలాటి రెస్క్యూ అవశేషము వుండదని ప్రొఫెసర్‌కి తెలుసును. బరువుగా ఊపిరి పీల్చుకుని మళ్లీ నిట్టూర్చాడు.

మరో ప్రక్క వింగ్ కమాండర్ విశ్వనాథ్ చెమటలు కక్కుతున్నాడు. స్పేస్ లేబ్ జ్యేష్ట వేగాన్ని పెంచడానికే దిశని మార్చడానికే నిర్దేశించబడిన బూస్టర్ రాకెట్లను పేల్చాడు. కాని ఏమీ ఉపయోగం లేకపోయింది. జ్యేష్ట నౌకని హెలీ మరింత శక్తివంతంగా లాగేస్తుంది. రాకెట్లకు మరింత ఇంధనం అందించాడు. ఫలితం ఆ శూన్యంలో శూన్యం అయింది. హెలీ దిశగా బిగించబడివున్న రిట్రారాకెట్లను బ్రేకులుగా వాడడానికి బ్లాస్ట్ చేసాడు. ఏమీ లాభం లేకపోవడంతో నిరుత్తరుడై పెనల్‌మీది టీవీని చూస్తూవుండిపోయాడు.

పేనల్‌మీది జ్యేష్ట వెలాసిటీని సూచించే ముల్లు క్షణక్షణానికీ పెరగసాగింది. నౌక గమనరేఖని చూపించే టీవీ స్క్రీన్‌మీది సరళరేఖ వక్రంగా మారుతూ హేలీ వేపుగా దిగజారిపోవడం కనిపిస్తుంది.

పేనల్‌మీది రీడింగ్‌నే గమనిస్తున్న ప్రొఫెసర్ వింగ్ కమాండర్ నిస్సహాయులై అయోమయ స్థితిలో చేష్టలుడిగిన సజీవ శిలా ప్రతిమల్లాగా వుండిపోయారు.

మరు నిముషంలో వెన్నలోకి చొచ్చుకపోయిన ఇనుపముక్కలాగ నౌక

మెల్లనై మెల్లనై బ్రేకువేసినట్లు ఏ కుదుపూ లేకుండా ఆగిపోయింది.

మరోమారు జరిగిన విషయం భూమికి చెపుదామని ట్రాన్స్‌మీటర్‌ని ఆన్ చేసాడు ప్రొ శ్యామసుందర్. కాని ఎంత ప్రయత్నించిన అది ఆన్ కాలేదు.

శ్యామసుందర్, విశ్వనాథ్ ఒకరి ముఖాలొకరు చూస్తు వుండిపోయారు.

అప్పుడే ఓ చిత్రం జరిగింది.

రిసీవర్ స్పీకర్‌లోనుంచి మాటలు.

''హలో ఎ రిక్వెస్టు టుది క్రూ ఇన్ ది షిప్. మీరు భయపడవద్దని మనవి. మిమ్మల్ని మా విశ్వనౌక ఆహ్వానిస్తుంది. బయటికి రండి. మళ్లీ మిమ్మల్ని క్షేమంగా భూమికి పంపే పూచీమాది''. అని వినిపించింది.

వాళ్ల ఆశ్చర్యానికి అవధుల్లేవు.

అది భూమి నుంచి వచ్చిన సందేశం మాత్రం కాదు. మరి హేలీ తోకచుక్కలోనుండి వైర్‌లెస్ మెసేజ్ ఎలా సాధ్యం.

''సమాధానం చెపుదామా'' అన్నాడు వింకో విశ్వనాథ్.

''ఆగు వాళ్లనే మరోమారు మాట్లాడనియ్యి'' అని వారించాడు ప్రొఫెసర్.

మళ్ళీ అవే మాటలు రిపీట్ అయ్యాయి.


''హలో! ఎవరు మీరు హేలీ తోకచుక్కలో జీవిస్తున్న మనుషులా! దయచేసి చెప్పండి'' అన్నాడు విశ్వనాథ్.

"అవును! ఎందరున్నారు మీ పేర్లు దయచేసి తెలియజేయండి."

ఇద్దరి పేర్లూ చెప్పాడు.

''శ్యామసుందర్ గారూ! విశ్వనాథ్ గారూ మీరు నిస్సందేహంగా నౌక బయటికి రావచ్చును. మీ గ్రూప్ కెప్టెన్ గుప్తగారు కూడా మా దగ్గర క్షేమంగానే వున్నారు'' అని వినిపించాయి మాటలు.

మరో ఆశ్చర్యకరమైన విషయం.



1986లో నౌకతో సహా హేలీని గుద్దుకుని చనిపోయాడనుకున్న గుప్త బ్రతికివుండడం. అప్పటికే అతని వయస్సు నలభై సంవత్సరాలు. ఇది మరో 76 సంవత్సరాలు. అంటే అతని వయసిప్పుడు 116 ఏళ్ళా! అసంభవం అనుకున్నారిద్దరూ.

'దయచేసి అతనిచేత మాట్లాడించండి' అని అర్థించాడు విశ్వనాథ్ .

పది నిమిషాలు నిశ్శబ్దం. తరవాత రిసీవర్‌లో "హల్లో! మై ఫ్రెండ్స్ అండ్ బ్రదర్స్ అయామ్ గుప్త స్పీకింగ్ మీరు మరెలాంటి సంశయాలూ పెట్టుకోకుండా దర్జాగా బయటికి రండి'' అని చెప్పాడు గ్రూప్ గుప్త.

గుప్త గొంతు అదివరకు వారు వినలేదు. కాని ఎప్పటిదో 20 శతాబ్దపు పాత యాస అతని ఇంగ్లీషులో వారికి వినిపించింది.

''సరేసర్! మరో పావుగంటలో మీముందు వుంటాం'' అని చెప్పి ప్రసార యంత్రం ఆఫ్ చేసేసాడు.

ఇద్దరూ స్పేస్ సూట్ తొడుక్కున్నారు. బ్రీథింగ్ ఎక్విప్‌మెంట్ తగిలించుకుని నౌక బయటికి వెళ్లే లాక్స్ వేపు నడిచారు. లాక్స్ తెరిచి శూన్యం గదిలోకి ప్రవేశించి మళ్లీ లాక్స్ మూసేసారు. ఎయిర్ లాక్స్ వెంటనే మూసెయ్యకపోతే లోపలిగాలి శూన్యంలోకి తప్పించుకుని బెలూన్‌లోని గాలి బయటికి వచ్చేసినట్లు వచ్చేస్తుంది. శూన్యం గదిలో చీకటి. లైట్ వెయ్యగానే వెలుగుతో నిండిపోయింది. వేలమీద (నేల, క్రింద, పైన అనేవి భూమ్యాకర్షణ పరిధిలోని పదాలు. శూన్యంలో క్రిందా పైనా అనే పదాలకి అర్థం వుండదు) అనేకన్నా ఆ గది మధ్యలో నేలమీద పరిచిన బల్లలాంటి ఓ తలుపువుంది. దానిని పైకి లేపారు. క్రింది భాగానికి చేరడానికి టనల్ కనిపించింది దాని మధ్యనుంచి నిచ్చెన. ఇద్దరూ నిచ్చెన దిగి వచ్చి చూసారు. జ్యేష్ట ఓ పెద్ద రాకెట్ బేస్‌మీద, భూమి మీద లాగే నిమ్మకి నీరెత్తినట్లు మంచుని వుంది.

నిచ్చెన దిగి ఆ బేస్‌మీద కాళ్లు ఆనించారు. నిల దొక్కుకోవడానికి పెద్ద ఇబ్బంది కలగలేదు. వారి కళ్లు అక్కడి వెలుగుకి కాస్త అలవాటు పడ్డాయి. చూస్తూ వుండానే కొన్ని చిత్రమైన ఆకారాలు కనిపించాయి.

ముందే వాళ్లని ఆహ్వానించడానికి ఎవరో వస్తారని ఊహించి వుండకపోతే ముక్కేదో కళ్లేవో కాళ్లేవో తెలియని ఆ ఆకారాలను చూసి గుండె లాగిపోయేనే అనుకున్నారు.

ఆ విచిత్రాకారుల మధ్యలో ఒకే తెలిసిన రూపం వుంది. అతడు గ్రూప్ కెప్టెన్ గుప్త అని వూహించడానికి వాళ్లకి ఎంతో సమయం పట్టలేదు. కాకపోతే వాళ్ళూహించి నట్లు వృద్ధుడు లాగలేదు. యాభైఏళ్ల మధ్య వయస్కుడిలాగ కనిపించాడు. అది మరో ప్రకృతి వైపరీత్యం.

అతడే ముందుకి వచ్చి కరచాలనం చేస్తూ 'నేనే కెప్టెన్ గుప్తని. మళ్ళీ ఇన్నేళ్ల తరవాత మన భూమి నుంచి మీరు రావడం సంతోషం రండి' అని ఓ ద్వారం వేపుకి దారితీసాడు.

అదీ ఒక పెద్ద రోదసీ నౌక అనీ హేలీమీద దిగి వున్నదనీ ఆ ద్వారం నౌకలోకి

ప్రవేశించే ద్వారం అని శాస్త్రీయ పరిజ్ఞానం నిండుగావున్న శ్యాసుందర్, విశ్వనాథ్ అర్థం చేసుకున్నారు.

ద్వారం తెరుచుకుని లోనికి వెళ్లారు. అక్కడ ఎయిర్‌లాక్స్ వున్నాయి. అందరూ లోన ప్రవేశించగానే వాటికవే మూసుకుపోయాయి.

లోపలి దృశ్యం కనువిందు చేసింది.

అది నభోస్వర్గం.

ఆహ్లాదకరమైన వాతావరణం.

ప్రొఫెసర్‌ని, విశ్వనాథ్‌ని చాలామంది వింత జీవులు చుట్టుముట్టారు.

అందులో ఒక ప్రముఖవ్యక్తి ఏవో శబ్దాలు చేసాడు.

అక్కడే చక్రాలమీద సంచరిస్తున్న ఓ యంత్రం ఆ ప్రముఖవ్యక్తి చేసిన శబ్దాలను 'నమస్కారం మీరు మా విశ్వ నౌకలోనికి రావడం మా అదృష్టం. మా ఆతిథ్యం స్వీకరించండి'' అని అనువదించింది.

పెద్ద హాలు, కూర్చోవడానికి కావలసినన్ని ఆసనాలు వాటిమీద అందరూ ఆసీనులయ్యారు.

ఆ ప్రముఖవ్యక్తి కొన్ని కుశల ప్రశ్నలు వేసాడు. వాటికి సమాధానం చెప్పాడు ప్రొఫెసర్ శ్యామసుందర్. ఇంటర్‌ప్రెటేషను ఆ అనువాద యంత్రం ఎంతో చక్కగా చేసింది.


మిగతా సమాచార సేకరణకి కెప్టెన్ గుప్తని వినియోగించారు. జరుగుతున్న సంభాషణని అనువాద యంత్రాలు అనువదించే ఏర్పాటు చేసారు. ఆ వింత జీవులు శ్రద్ధగా వింటున్నారు.

"ప్రొఫెసర్ గారూ ఎలా వుంది మన భూమి'' అని ముందుగా మొదటి ప్రశ్న వేసాడు గుప్తా.

"బాగానే వుందండి కాకపోతే ఇలాగే రేపూ వుంటుందనే నమ్మకం మాత్రం లేదు. అగ్రదేశాల మధ్య అనుమానాలు పెరిగిపోతున్నాయి. ప్రపంచం నిండా అణుబాంబులు నిండిపోతున్నాయి. యుద్ధం గనకవస్తే వాటిని ప్రయోగించక మానరు. అదే జరిగితే ఒక్క జీవికూడా భూమిమీద బ్రతకడం కష్టం'' చెప్పాడు ప్రొఫెసర్.

వింగ్ కమాండర్ కూడా కలగచేసుకుని "ఎన్నోమార్లు యుద్ధం వచ్చినట్లే వచ్చి తప్పిపోయిందండి లేకపోతే ఈ పాటికి భూమి స్మశానం అయివుండేది'' అన్నాడు.

వారి సంభాషణలు శ్రద్ధంగా వింటున్న వింత జీవులలో ఒకరకమైన కలకలం బయలుదేరింది. వారు ఏవో శబ్దాలు చేసి గుప్తకి ఏదో చెప్పారు. గ్రూప్ కెప్టెన్ గుప్త ముఖం వివర్ణమయింది. ఎంతో ఆవేదన ఆ



### ముందు జాగ్రత్త

ఒక ప్రముఖ 'బార్' ముందు 'నోటీస్' ఇలా రాసి ఉంది.

"దయచేసి లోపలికి వచ్చే ముందు మీ జేబులో పూర్తి అడ్రస్, టెలిఫోన్ నెంబర్ ఉందో లేదో "చెక్'' చేసుకుని మరీ రండి!''

—జోకర్ (హైదరాబాద్)

ముఖంలో వ్యక్తమయింది.

అతడు ప్రొఫెసర్ వేపు చూసి "ప్రొఫెసర్ గారూ! మన భూవాసులకి వీళ్లకి పట్టిన దుర్గతి పట్టకుండా వుండాలంటే భూమిమీద అణుయుద్ధం రాకూడదు" అన్నాడు.

కెప్టెన్ చెప్పేదేమిటో అంతుపట్టలేదు. వింకో విశ్వనాథ్ ముందుగా "ఏమిటి మీరనేది ఏమిటి వాళ్లకి పట్టినదుర్గతి?" అని అడిగాడు.

ప్రొఫెసర్ శ్యామ్‌సుందర్ కూడా ఏమి చెపుతాడా అని శ్రద్ధగా వినసాగాడు.

ఉచ్ఛ్వాస నిశ్వాసాలు కూడా స్పష్టంగా వినిపించేటంతటి నిశ్శబ్దం. ఆ వింత జీవులు కూడా ఎలాంటి శబ్దాలూ చెయ్యలేదు. వాళ్ల డిసిప్లిన్ అలాంటిది.

గ్రూప్ కెప్టెన్ గుప్త గొంతు సవరించుకున్నాడు.

"వినండి. వీళ్ళు సంచారి నక్షత్ర మండలంలోని ఒకానొక నక్షత్రానికి సంబంధించిన గ్రహకూటమిలోని మన భూమి లాంటి 'నభోతల' అనే గ్రహానికి చెందినవారు. దాదాపు వంద సంవత్సరాల క్రితం... ఐ మీన్ మన భూమి మీది సంవత్సరాల ప్రకారం వంద ఏళ్ల క్రితం అన్నమాట. వీళ్ల గ్రహంమీద "అణుయుద్ధం" వచ్చింది. సర్వజీవులూ నశించి ఒక స్మశానంలాగ మారిపోయింది ఆ గ్రహం. నేటికీ అక్కడ ఇంకా జీవులు బ్రతకడానికి సరియైన వాతావరణం ఏర్పడలేదు. అందుచేతనే వీళ్లు హేలీ కేంద్రకంలో నివాసం ఏర్పరచుకుని అక్కడ వాతావరణం సరి అయ్యేదాకా బతుకుతున్నారు" అని వివరించాడు.

తలా తోకా లేనట్లున్న అతని వివరణ విశ్వనాథ్‌కి అర్థం కాలేదు. గ్రహం నాశనం అవడమేమిటి హేలీ తోకచుక్కలో నివసించడమేమిటి అనుకున్నాడు.

ఏస్ట్రోఫిజిసిస్టు శ్యామసుందర్ కూడా అలాంటి ఆలోచనల్లోకే జారిపోయాడు. హేలీ తోకచుక్క మీద దిగి బ్రతకడం సంభవమా!? భూమి మీద జీవరాశి ఏర్పడడానికి కారణం తోక చుక్కలేనని ఏనాడో ఫ్రెడ్ హోయల్ డాక్టర్ విక్రమసింఘె సిద్ధాంతీకరించారు. అది నిజమేనని రష్యా నౌక 'వేగ' కొన్ని హైడ్రోకార్బన్ల ఉనికిని హేలీ తోకలో వున్నట్లు గుర్తించడం ద్వారా 1986 సంవత్సరంలోనే నిరూపించబడింది. ఈ 2062 సంవత్సరంలో మరిన్ని వివరాలు సేకరించడానికి ఈ హేలీ న్యూక్లియస్‌లోని కొంత పదార్థాన్ని కూడా భూమికి తీసుకుని వెళ్ళడానికే తమని క్షేత్రంతో ప్రయోగించారు. వీళ్ల ఉనికి తోకచుక్కమీద కనిపిస్తూనే వుంది. మరి గ్రహం నాశనమైనప్పుడు వీళ్ళెందుకు చనిపోలేదో అనుకుని—

"మరి వీళ్లెలాగ ఆ గ్రహం నుంచి బయటపడ్డారు" అని ప్రశ్నించాడు.

కెప్టెన్ గుప్త శ్యామసుందర్ భుజంమీద చెయ్యివేసి ఆప్యాయంగా నొక్కుతూ "నాకు తెలుసుమీకు ఈ అనుమానం వస్తుందని. అణుయుద్ధం నభోతలమీద మొదలవడానికి ముందే ఈ శాస్త్రజ్ఞుల బృందం వారి సౌర కుటుంబంలోని ఇతర గ్రహాలలో ప్రాణికోటి

వున్నదో లేదో తెలుసుకోవడానికి ఈ విశ్వనౌకలోనే బయలుదేరారు. వారి గ్రహాలలోని చివరి కక్ష్యలోని గ్రహంమీద దిగి పరిశోధనలు చేస్తూ వుండగా యుద్ధ సమాచారం అందింది. తరవాత సంకేతాలు ఆగిపోవడంతో వెంటనే బయలుదేరి గ్రహాన్ని చేరుకున్నారు. ఉపరితలం అంత ఓ బూడిద కుప్పలాగ కనిపించడం వాతావరణం అంతా ఆల్ఫా, బీటా, గామా కిరణ ప్రసారంవలన జరిగిన రసాయనిక మార్పుచేత విషపూరితం కావడంచేత మళ్లీ నౌక మీద వెనక్కి వచ్చేసారు'' అని చెప్పి కాస్త ఊపిరి పీల్చుకున్నాడు.

ఇంకో విశ్వనాథ్‌కి ఆతృతగా వుంది. "మరి ఈ తోకచుక్కలోకి ఎలా వచ్చారు?'' అని మళ్లీ గుర్తు చేసాడు.

''చెబుతాను. వారి గ్రహరాశిలో ఒక్కదానిమీద జీవరాశి లేదు. జీవించడానికి అనువైన వాతావరణం తినే పదార్థం కూడా లేకపోయింది. అలా శూన్యంలో నిరాశ్రయంగా తిరుగుతున్న వారికి ఒయాసిస్ కనిపించినట్లు మన హేలీ తోకచుక్క కనిపించింది. ఈ విశ్వనౌకలోని శాస్త్రజ్ఞులు దాని కాంతిని విశ్లేషించి జీవితానికి అవసరమైన నీరు వున్నట్లు కనుక్కున్నారు. అదీగాక నౌకలోని ఇంధనం ఖర్చులేకుండానే ఉన్న వేగాన్ని పోగొట్టుకోకుండా సరళరేఖలో వ్యోమనౌక ప్రయాణించగలదని మీకూ తెలుసును. కాని దిశని మార్చాలన్నా వేగాన్ని పెంచాలన్నా, తగ్గించాలన్నా రాకెట్లు పని చెయ్యాలి. రాకెట్లు పని చెయ్యాలంటే ఇంధనం కావాలి. ఎంత అణుశక్తిలో పని చేస్తున్న రాకెట్లయినా ఆ అణుశక్తి మాత్రం నిండుకోదని ఏముంది? ఎంతకాలం శూన్యంలో జీవించాలో తెలియదు. ఆహార సమస్య అందుచేత వారి గ్రహరాశికి చెందిన తోకచుక్క కాకపోయినా హేలీ న్యూక్లియస్ మీద దిగాలని నిర్ణయించుకున్నారు. ఒకరకంగా చూసుకుంటే ఒకే దెబ్బకి రెండు పిట్టల్లాగ వారి ఆహార సమస్య తీరింది. ఇంధనం ఖర్చు లేకుండా ఉచిత



## మరో పార్లమెంట్

కంగారుపడకండిసార్! మన దేశానికి ఉండేది ఒక పార్లమెంటే! కాకపోతే తమిళనాడులోని తంజావూర్‌కు చెందిన తమిళ విశ్వవిద్యాలయం ఎంతో కష్టపడి పార్లమెంట్ భవనం లాగానే తమ గ్రంథాలయాన్ని నిర్మించింది. మరో పార్లమెంట్ భవనంలా దర్శనమిచ్చే ఈ గ్రంథాలయంలో 50 వేల పుస్తకాలు 650 తమిళ పత్రికలూ వుంటాయట! ఇంతకీ ఈ భవన నిర్మాణానికి ఎంత ఖర్చయిందో తెలుసా? కోటి రూపాయలయ్యిందట సార్! ఏమైతేనేం... పార్లమెంట్ భవనాన్ని పోలిన మొట్టమొదటి భవనం ఇదే!

—జూపిటర్

రవాణా సాధనంగా మరో నక్షత్ర గ్రహరాశిలోకి మోసుకు పోగల వాహనం దొరికింది. అందుకు హెలీ మీద దిగిపోయారు. మిగతా కథ మీకు తెలిసిందే'' అని ముగించాడు గుప్త.

తలకాయలా గుంది అనుకున్నాడు విశ్వనాథ్. అతనికి చాలా ప్రశ్నలు తేలుకొండీల్లాగా బయల్దేరాయి. వీరు తోకచుక్కమీద దిగి ఎన్నేళ్లయింది? ఇంత కాలం నుంచీ ఆహారాన్ని ఎలాగ సంపాదించుకుంటున్నారు? గుప్తని తామిద్దర్ని ఎందుకని సంగ్రహించినట్లు? అదే ప్రశ్నలు వేసాడు.

కెప్టెన్ గుప్త గలగలా నవ్వాడు. వింగ్ కమాండర్ విశ్వనాథ్ భుజాలు పట్టి కుదిపేస్తూ '' అదీ నేనే చెప్పాలా'' అవి మీరు చూసి గ్రహించవలసిన విషయాలు'' అన్నాడు.

నిజమే తనకింత ఆతృత పనికిరాదు. ఈనాడు ప్రొఫెసర్ తనూ జట్టుగా తోకచుక్కమీద దిగారు. మరి ఆనాడు గుప్తగారు ఎలాంటి సస్పెన్సు భరించాడో. తెలిసిన మరో ప్రాణిలేని ఈ విచిత్ర జీవాలలో ఎలా వేగాడో అనుకున్నాడు.

''హేట్స్ ఆఫ్ టు యు సర్. ఆనాడు 1986 సంవత్సరంలో మీరొక్కరూ ఈ హేలీమద దిగినప్పుడు మీ గుండె ఎలా తట్టు కుందో. ఆనాడు కూడా ఈ అనువాద యంత్రాలున్నాయా అండీ?'' అని అడిగాడు.

''ఆ వున్నాయి. భావతరంగాలను వారి భాషలోకి మార్చడంవలన సమస్య కొంచెం తేలిక అయింది. ఇప్పు డైతే నేను వారి భాషలో కూడా పాండిత్యం సంపాదించాను'' అన్నాడు గుప్త.

అంతలోనే కొన్ని రోబొట్లు ఏదో ఆహారాన్ని అందమైన ప్లేట్లలో అందించాయి.

విశ్వనాథ్, ప్రొఫెసర్ మొదట సందేహించినా తరువాత గుప్త చెప్పగానే తిన్నారు. ఎంతో రుచిగా వుంది ఆ పదార్థం. ఏదో తియ్యని పానీయం కూడా ఇచ్చారు. తాగారు.

''దేంతో చేశారోగాని మాంసాహారమో శాఖాహారమో తెలుసుకోలేక పోయాను'' అన్నాడు విశ్వనాథ్.

''ఒకానొక ఉష్ణోగతతో నొకాంతర్భాగంలోనే పెంచబడుతున్న పుట్టగొడుగులు, కొన్ని రకాల మొక్కలకాండాలతో దీనివి తయారు చేసారు'' అని వివరించాడు గ్రూప్ కెప్టెన్ గుప్త.

మళ్ళీ అతనే ''ఇందాక మీరు ఈ విశ్వనొక తోకచుక్క మీద ఎన్నేళ్ల క్రితం దిగింది అని కదూ మీరు అడిగారు. రండి'' అని ఒక కంప్యూటర్ కంట్రోలు గదిలోకి తీసుకువెళ్లాడు.

కంప్యూటర్‌ని ఆన్ చేసి ఏవేవో కొన్ని స్విచ్‌లు నొక్కాడు. టి.వి తెరమీద ఏవో గీతలు అంకెలు లాంటివి కనిపించాయి. ఆ భాష ఏమిటో ప్రొఫెసర్‌కిగాని, విశ్వనాథ్‌కిగాని అర్థం కాలేదు.

గుప్త ఆ సంఖ్యలను చూసి నొక సరిగ్గా 112 సంవత్సరాల క్రితం అంటే మన

భూమి మీది కాలమానం ప్రకారం 1950 సంవత్సరంలో దిగింది. హేలీమీద సవారు చేస్తూ భూమి దగ్గరికి మొదటి విడతగా 1986 సంవత్సరంలో వచ్చింది. నన్ను మన నౌకతో సహా ఆకర్షించేసింది"అన్నాడు.


ప్రొఫెసర్ ప్రశ్నార్థకంగా గుప్త వేపు చూసాడు.

"మీ అనుమానం నా కర్థమైంది. మరి భూమిమీద అప్పుడే ఎందుకని దిగలేదు అని గదూ. కన్నతల్లి లాంటి వారి గ్రహంవారి మెదడులో ఎప్పుడూ మెదులుతూనే వుంటుంది. మరో మారు హేలీ మీద వెళ్లి గ్రహంమీద దిగి చూడాలనుకున్నారు. సరిగ్గా 40 సంవత్సరాల క్రితం 2022 సంవత్సరంలో నౌకమీద తోకచుక్క మీద నుంచి టేక్ ఆఫ్ చేసి వెళ్ళి 'నభోతల' మీద దిగి పరిశీలించాము. వాతావరణలో ఇంకా సరిపడా ప్రాణవాయువు లేదు. మొక్కా మోడూ మొలవలేదు. అందుచేత మళ్లీ హేలీనే ఆశ్రయించవలసి వచ్చింది" అని ప్రొఫెసర్ అనుమానం నివృత్తి చేసాడు.

"ఇప్పుడైనా మన భూమికి వచ్చెయ్యావచ్చును గదా!" అన్నాడు ప్రొఫెసర్.

వింత జీవులు ప్రొఫెసర్ భావం అర్థం చేసుకున్నారు. గుప్తకి ఏదో చెప్పారు.

"వాళ్ళకిష్టం లేదు ప్రొఫెసర్ గారూ! మన భూమిమీదకి దిగడం అంటే పెనంలోంచి జారి పొయ్యిలో పడడం అని వారు భావిస్తున్నారు. ఇందాక మీరు



భూమిమీద, అణు యుద్ధ భయం వున్నట్లు చెప్పారు గదా. వాళ్లకి అణు బాంబులు అంటే జుగుప్స, అసహ్యం. అప్పుడెప్పుడో మన భూమిమీద కూడా అణు బాంబులు వేసారనీ హిరోషిమా నాగసాకి పట్టణాలమీద వేసారనీ లక్షలాది మంది చనిపోయారనీ నేను కూడా చెప్పడం జరిగింది. అందుచేత మన మానవత్వం మీద వారికి నమ్మకం లేకుండా పోయింది'' అని వారి సంభాషణల సారాంశం విపులీకరించాడు.

శ్యామసుందర్ విశ్వనాథ్ సిగ్గుతో తలలు వంచుకున్నారు. ''మరి మా మాటేమిటి?'' అన్నారిద్దరూ.

''మిమ్మల్ని భూమికి పంపేసే ఏర్పాట్లు జరుగుతున్నాయి''

''విశ్వనాథ్ మీరు మాతో వచ్చెయ్యరా గుప్తాసాబ్'' అని అభ్యర్థిస్తున్నట్లు అడిగాడు.

గుప్త విచారంగా "నా కెవరున్నారు నాయనా భూమి మీద. నా సమకాలికులెవరూ బ్రతికి వుండరు. నా మనమలో, మునిమనుమలో వుండి వుంటారు. వారిని వెతుక్కుంటూ తిరగాలి'' అన్నాడు. అతని కన్నుల్లో గత స్మృతులు మెదిలాయి.

సడెన్‌గా శ్యామసుందర్‌కి తళుక్కున ఒక ప్రశ్న మెదడులో స్ఫురించింది. ''మీరు ముసలవకుండా ఇలాగ నడివయస్కుడి లాగ వుండడం ఆశ్చర్యమే. మీరు ఇలా ఎలాగ వుండగలుగు తున్నారు? అని ప్రశ్నించాడు.

గుప్త నవ్వుతూ ''ఏమో నాకూడ తెలియదు. మన ఐన్‌స్టైయిన్ థీరీ ఆఫ్ రిలేటివిటీ వల్లనేమో, గంటకి లక్షలమైళ్ల వేగంతో హేలీ మీదవుండి ప్రయాణించడం వల్లనేమో'' అన్నాడు.

తరువాత కొన్ని రోజులు చాలా హాయిగా ప్రొఫెసర్ శ్యామ్‌సుందర్ వింగ్ కమాండర్ విశ్వనాథ్ ఆ విశ్వనౌకలో కాలక్షేపం చేసారు

హేలీ భూమికి అతి దగ్గరగా వచ్చింది కేవలం మూడున్నర కోట్ల మైళ్ల దూరంలో వుంది. ప్రొఫెసర్‌ని, విశ్వనాథ్‌ని వాళ్ళు వచ్చిన నౌకమీదనే భూమికి పంపే ఏర్పాట్లు జరిగాయి. అందరూ వారిద్దర్ని నౌకదాక సాగనంపారు. జ్యేష్ఠని నిచ్చెన ద్వారా అధిరోహించే ముందు అందరికీ చేతులు వూపుతూ వుండిపోయారు.

గ్రూప్ కెప్టెన్ గుప్తకి కళ్లు చెమర్చాయి. వాళ్లకే మూడ్స్ చెడిపోయాయి. మనస్సుని రాయి చేసుకుని నిచ్చెన ఎక్కి లాక్స్ తెరుచుకుని లోనికి వెళ్ళిపోయారు. లాక్స్ మూసుకుపోయాయి.

అందరూ చూస్తూవుండగానే విశ్వనౌకమీది రాకెట్ లాంచింగ్ పేడ్ మీదనుంచి జ్యేష్ఠ మంటలు చిమ్ముకుంటూ భూమి దిశగా దూసుకుపోయింది.

గుప్త ఆ విచిత్ర జీవులూ వీడ్కోలుగా చేతులు వూపుతూనే వుండిపోయారు. చూస్తూ వుండగానే చిన్న చుక్కగా కోట్లాది చుక్కల్లో ఒక్కటిగా మారిన జ్యేష్ఠ చివరికి అదృశ్యమైంది. ఇవేవీ పట్టని హేలీ తోకచుక్క తన కక్ష్యలో దిగంతాల వేపు సాగిపోసాగింది.

*